
ప్రజాశక్తి
శనివారం 15 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



ఏరియా ఆసుపత్రి వైద్య సేవలు భేష్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు బాగానే ఉన్నాయని జిల్లా ఆసుపత్రిలో సమన్వయకర్త జి.నాగభూషణరావు అన్నారు. శుక్రవారం ఆయన ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఇక్కడ ఆస్పత్రి వైద్య సేవలు బాగానే ఉన్నాయని, ఓపి కూడా బాగానే వస్తుందని అన్నారు. ఆసుపత్రిలో ప్రతి వార్డు పరిశీలించారు. జిల్లాలో 10 వైద్యాధికారుల పోస్టులు ఖాళీలు ఉన్నాయని, త్వరలో పీజీ పూర్తి చేసిన వైద్యులు వస్తారని చెప్పారు. ఏరియా ఆసుపత్రి అదనపు భవనం పూర్తయితే ఇంకా ఎక్కువ సేవలు అందించవచ్చన్నారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, సివిల్ సర్జన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆగంగూడకు అసంపూర్తి రోడ్డు

- 8నెలల్లో ఛిద్రమైన బిటి రోడ్డు
- రూ.కోటి 95లక్షలు బుగ్గిపాలు
- ప్రభుత్వ విప్ ఇలాకాలో రోడ్ల దుస్థితి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరిగిన రహదారుల నిర్మాణంలో అవినీతి ఏరులై పారుతోంది. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన బిటి రోడ్డు నిర్మాణం జరిగిన 8నెలల్లోనే ఛిద్రమైంది. మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.95 కోట్లు ఖర్చు చేశారు. కురుపాం మండలం తిత్తిరి ఆర్ అండ్ బి రోడ్డు నుంచి వలసబల్లేరు పంచాయతీ ఆగంగూడ వరకు మూడు కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయితే ఆ నిధులు ఖర్చు చేసే రోడ్డు నిర్మించిన గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు ఆగంగూడ వరకు నిర్మించలేదు. 400 మీటర్ల వరకు రోడ్డు నిర్మించకుండా వదిలేయడంతో ఆగంగూడ గ్రామస్తులు రాకపోకలకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగిలిన 400 మీటర్ల రోడ్డు నిర్మించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఇంతవరకు మూడు సార్లు వినతులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరికి మూడు సార్లు వినతులు అందజేసినా ఫలితం లేకపోయింది. అసలు ఈ రోడ్డు నిర్మాణానికి మొదట ఆగంగూడ గ్రామస్తులు 2018లో తలో రూ.20వేలు చందాలు ఎత్తుకుని సుమారు రూ.15లక్షలతో మట్టి రోడ్డు నిర్మించుకున్నారు. ఇప్పమానుగూడ నుంచి ఆగంగూడ వరకు గ్రామస్తులే సొంత నిధులతో మట్టి రోడ్డు వేసుకున్నారు. ఆ తర్వాత గ్రామానికి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా వచ్చిన అప్పటి ఐటిడిఎ పిఒ లక్ష్మీషా బిటి రోడ్డు 2020లో మంజూరు చేశారు. తిత్తిరి ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఆగంగూడ వరకు బిటి రోడ్డు నిర్మించారు. కానీ 400 మీటర్ల పొడవు రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. దీంతో ఆగంగూడ గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లడానికి రోడ్డు లేక తీవ్ర ఇబ్బంది గురవుతున్నారు. ఇటీవల తుఫాన్ల కారణంగా వదిలేసిన రోడ్డు మరింత అధ్వాన్నంగా తయారైంది. 400 మీటర్ల రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చలనం లేదు.

నిర్మించిన రోడ్డు ఛిద్రం

తిత్తిరి ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఆగంగూడ వరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో బిటి రోడ్డు నిర్మించారు. ఈ ఏడాది జూన్ నుంచి వరుస తుఫాన్ల కారణంగా బిటి రోడ్డు వర్షాలు పడడంతో ఒక కిలోమీటరు మేర రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డు నిర్మించి ఏడాది పూర్తి కాకముందే వర్షాలకు కొట్టుకుపోయిందంటే దానిలో నాణ్యత ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. ఏజెన్సీ గ్రామాల్లో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న బిటి రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలకు ఈ రోడ్డు నిదర్శనంగా కనిపిస్తోంది. కొత్తగా నిర్మించిన బిటి రోడ్డు కొట్టుకుపోవడం, 400 మీటర్ల మేర రోడ్డు వేయకపోవడంతో ఆగంగూడ గ్రామస్తులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఏడాది కాకముందే రూ.కోటీ 95లక్షలతో నిర్మించిన బిటి రోడ్డు వర్షాలకు ఛిద్రమవడంతో గిరిజనుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఇలాకాలో రోడ్ల నిర్మాణం లో అవినీతి ఏరులై పారుతోందనడానికి ఈ రోడ్డు మచ్చుతునక అని చెప్పవచ్చు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం వల్ల గిరిజన గ్రామాల్లో రోడ్లు నాణ్యతా లోపాలకు నిలయాలుగా మారుతున్నాయి.

వేసిన రోడ్డు కొట్టుకుపోయింది

తిత్తిరి ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఆగంగూడకి 400మీటర్ల ముందు వరకు నిర్మించిన బిటి రోడ్డు వర్షాలకు ఛిద్రమయింది. ఫిబ్రవరిలో నిర్మించిన బిటి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కిలోమీటరు మేర కొట్టుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నాం. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

బిడ్డిక సుక్కు, గ్రామపెద్ద, ఆగంగూడ



వర్షానికి ఛిద్రమైన రోడ్డు

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

తిత్తిరి ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఆగంగూడ వరకు రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. ఆగంగూడకి ముందు 400 మీటర్ల రోడ్డు నిర్మించలేదు. దీని వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో మూడు సార్లు వినతులు అందజేశాం. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి సమస్యల్ని వివరించాం. చేస్తాం,చూస్తాం అంటున్నారు కానీ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు.

బిడ్డిక కుసుమ, సర్పంచ్,, ఆగంగూడ

నేటి బాలలే- రేపటి భవిష్యత్తు వెలుగులు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ వెలుగులని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇది మీ పండుగ, పిల్లల పండుగ, ప్రతీ రోజు సంతోషంగా ఉత్సాహంగా పిల్లలు ఉంటేనే అందంగా ఉంటుందన్నారు. ఈ వేడుకలను రాబోయే 20న ప్రపంచ పిల్లల దినోత్సవం రోజును ఇంకా వైభవంగా జరుపుకుందామన్నారు. ప్రతి నెలా ఇలాంటి ఉత్సవాలు జరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రతి పాఠశాలలోనూ ఆఖరి గంట ఆట, పాటలతో పిల్లలు గడిపేలా చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించానని, ఎవరైనా ఆడుకోవడానికి అవకాశం ఇవ్వకపోతే తనకు చెప్పండని కలెక్టర్ పిల్లలకు సూచించారు. అలాగే ప్రతి శనివారం సాయంత్రం అన్ని పాఠశాలల్లో ఆటలు పాటలతో జోష్‌గా ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలు చేసుకుంటే జీవితం నాశనమైపోతుందన్నారు. తల్లిదండ్రుల బలవంతంపై చిన్న వయసులోనే వివాహం చేసుకున్న లేదా మీ స్నేహితుల్లో అలాంటి పరిస్థితి ఎవరికైనా వచ్చినా వెంటనే 1098 కి ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎఎస్‌పి మనీషా రెడ్డి మాట్లాడుతూ చివర బెంచ్‌లో కూర్చునే వారికి మంచి ఆలోచనా శక్తి ఉంటుందన్నారు. ఎప్పటికైనా ముందుకు వెళ్లాలనే ఆలోచన ఉంటుందని, క్రమశిక్షణ మన జీవితంలో చాలా ముఖ్యమని పేర్కొన్నారు. శ్రద్ధ, కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే జీవితంలో ముందుకెళ్లగలమన్నారు. ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి మాట్లాడు తూ భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదిన నవంబర్ 14 కావడం ఆయనకు పిల్లలంటే ఎంతో ఇష్టమని అందువల్లే ప్రతి ఏటా నవంబర్ 14న జాతీయ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటు న్నామని అన్నారు. ఈరోజు పిల్లలకు పండగని వారి హక్కులను కాపాడల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డిఇఒ రాజ్‌కుమార్ మాట్లాడుతూ బాలల్లో క్రమశిక్షణ, శుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం అందేలా ముస్తాబు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ ఉపాధ్యాయులు నేర్పించాలని తెలిపారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నృత్య గీతం, పార్వతీపురం డివిఎంఎం పాఠశాల విద్యార్థిని ఎస్.కేశవర్ధిని పాట, పాలకొండ మండలం చిన్న మంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన స్కిట్ అహుతులను ఆలోచింపజేసింది. అలాగే సీతంపేట కెజిబివి విద్యార్థినుల గిరిజన సాంప్రదాయ నృత్య ప్రదర్శన, భామిని మండలం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని చక్కని గాత్రంతో పాటలు పాడారు. సీతానగరం మండలంలోని జోగింపేట కెజిబివి విద్యార్థినులు నాటకం ప్రదర్శించారు. కొమరాడ మండలం బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినుల నృత్య పదర్శన అలరించింది. సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం మిషన్ వాత్సల్య పథకం గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజా రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలల దినోత్సవం



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా జడ్జి దామోదరరావు

బాలల హక్కులపై అవగాహన అవసరం

రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

బాలలకు న్యాయపరమైన హక్కులపై సంపూర్ణ అవగాహన ఉండాలని రెండో అదనపు జిల్లా జడ్జి, మండల సేవా కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ పిల్లల భద్రత, హక్కుల పరిరక్షణ ప్రతి కుటుంబం బాధ్యతని తెలిపారు. బాలల విద్య, ఆరోగ్యం, భద్రత, రక్షణ, భావ వ్యక్తీకరణ వంటి అనేక న్యాయపరమైన హక్కులున్నాయని, వీటినిరక్షించడానికి ప్రభుత్వం పోక్సో చట్టం, జెజె యాక్ట్, చైల్డ్ లేబర్ నిషేధ చట్టం వంటి పలు చట్టాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలో బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాలని సూచించారు. సంఘటన జరిగిన వెంటనే చట్టపరంగా నమోదు చేసి న్యాయ సహాయం అందించడంలో ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. జిల్లాలోని పాఠశాలలు, ఆంగన్‌వాడీలు, చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, ఎఎస్ఐ జి.రామకృష్ణ, అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిని అడ్డుకున్న ఒడిశా అధికారులు

డబుల్ ఇంజిన్ సర్కార్‌లోనూ కష్టాలే..

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని తోణాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అజయ్ ఆధ్వర్యంలో వైద్యబృందం శుక్రవారం కొటియా గ్రామాల ప్రజలకు సంచార వైద్య సేవలను అందించడానికి ఎగువ గంజాయిభద్ర చేరుకోని అక్కడ గిరిజనులకు సేవందించేందుకు సిద్ధమయ్యారు. అంతలో ఒడిశా అధికారి వచ్చి ఇక్కడ వైద్యం చేయడానికి మీకు ఎటువంటి అధికారం లేదని, వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపొండని ఆయన చెప్పగా వైద్య సిబ్బంది ఇక్కడ ఉండే గిరిజనులకు వైద్య సేవలు నిమిత్తమే ఇక్కడికి వచ్చామని, వారికి వైద్య సేవలు చేసి వెళ్లిపోతామని చెప్పారు. అయినా ఆయన వినిపించుకోకుండా పొట్టంగి బిడిఒకు ఫోన్ చేసి ఆయన్ను కూడా ఇక్కడికి రప్పించారు. ఇక్కడ ఆంధ్రా అధికారులు ఎటువంటి వైద్య సేవలు గానీ, ఏ కార్యక్రమాలు గాని చేయడానికి వీల్లేదని వెంటనే ఇక్కడి నుండి వెళ్లిపోండి బిడిఒ చెప్పగా వైద్య సిబ్బంది ఏమీ చేయక అక్కడినుండి విని తిరిగి వచ్చేశారు.

పాలకుల నుంచి కొరవడి సహకారం

గతంలో ఇలా చాలాసార్లు ఆంధ్ర అధికారులు వైద్యం కోసం, ఇతర అభివృద్ధి పనుల కోసం వెళ్లినప్పుడు ఒడిశా అధికారులు, పోలీసులు వచ్చి అడ్డుకోవడం, ఇబ్బందులు పెట్టడం జరుగుతోంది. సరైన రక్షణ లేక, నిరంతర ఘర్షణలు తప్పడం లేక ఉద్యోగులు ఏమీ చేయలేక వెనుతిరిగి వస్తున్నారు. కొటియా గ్రామాల్లోని గిరిజనులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నా, ప్రభుత్వాల నుంచి సరైన సహకారం లేకపోవడం అభివృద్ధి కార్యక్రమాలు చేయడం ఉద్యోగులకు తలకు మించిన భారంగా మారుతోంది అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ఏ కార్యక్రమం నిర్వహించినా ఒడిశా అధికారులు, పోలీసులు వచ్చి రభస చేసి, హుకుం జారీ చేయడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌లోనూ కష్టాలే....

గతంలో ఆంధ్రాలో వైసిపి, ఒడిశాలో బిజెడి ప్రభుత్వాలు ఉండడంతో సమస్య పరిష్కారం కాలేదు. అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, ఒడిశాలో బిజెపి ప్రభుత్వం "ఒకే సర్కారు" భాగస్వామ్యంతో ఉండడంతో సమస్య సమసిపోతుందని ఈ ప్రాంత వాసులు ఆశించారు. కానీ, ప్రభుత్వాలు ఏర్పడి 16 నెలలైనా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు నిరంతరం పునరావృతమవుతూనే ఉన్నాయి.

కొటియా గ్రామాల వివాదం సుప్రీంకోర్టులో స్టేటస్‌కో ఉండటంతో అభివృద్ధి ఎవరు చేసినా సహకరించేలా ఉండాలి. కానీ నిరంతరం ఒడిశా అధికారులు ఇలా వ్యవహరించడం, ముఖ్యంగా అభాగ్యులైన గిరిజనులను ఇబ్బంది పెట్టడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, సరిహద్దు వివాదంతో సంబంధం లేకుండా ప్రజలకు కనీసం మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కొటియా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వైద్యాధికారితో వాగ్వివాదానికి దిగిన ఒడి అధికారులు, పోలీసులు



ఆర్‌టిసి డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు నాయకులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎస్ డబ్ల్యు ఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

పార్వతీపురం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టిసి ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఆర్‌టిసి డిపో ముందు ధర్నా నిర్వహించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎఎస్‌టి బాబు ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నానుద్దేశించి రాష్ట్ర నాయకులు వి.రాములు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం రీయింబర్స్మెంట్‌కు రూ.400 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమన్నారు. అయితే ఈ పథకం అమలు కోసం పని చేస్తున్న కండక్టర్, డ్రైవర్, మెకానిక్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రయాణీకులకు స్మార్ట్ కార్డులు జారీ చేయాలని, సిబ్బంది నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. వన్ బార్ 2019 సర్క్యులర్ అమలు చేసి అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమోషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్టీసి రూట్లలో ప్రయివేటు ట్రావెల్స్ అక్రమ రవాణా అరికట్టాలని కోరారు. బస్ స్టేషన్ల ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకోవాలని, విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకే ఇవ్వాలని, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పెట్టి మహిళలకు మంచి చేసినా, చిన్న చిన్న తప్పులు చూపించి కండక్టర్లను సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రయివేటు పరం చేసే ఆలోచన విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, బివి రమణ, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు బి.మోహన్, ఎస్సే రాజు, పి.రాజు, నాయుడు, శంకర్రావు, ఎం కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ జయప్రదానికి కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభలు ఈనెల 15,16 ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో జరుగుతున్నాయని, ఈ మహాసభలో జయప్రదం కావాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ కొరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీ ఉద్దేశించి ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, సాలూరు కమిటీ అధ్యక్షుడు కార్యదర్శులు శంకర్రావు, రవి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు కార్మికులకు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయడం లేదని, దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని ఈ అంశాలపై రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్తులో కార్మిక సమస్యలపై కర్తవ్యాలు నిర్ణయిస్తాయని తెలిపారు. మహాసభ జయప్రదానికి ప్రజలు మేధావులు సంఘాలు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ నాయకులు రాముడు, వెంకన్న, పోలరాజు, వెంకట్రావు, పార్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

పాలకొండ : ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ 15 రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి సిహెచ్ సంజీవి అన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. మున్సిపల్ కార్మికుల భద్రతతో పాటు పట్టణ ప్రజల ఆరోగ్య, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలపై ఈ మహాసభల్లో చర్చ జరుగుతుందన్నారు. ఒంగోలులో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక నగర పంచాయతీలో రెండు నెలల జీతాలు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్తీక్, పి.శ్రీను, శ్రీదేవి, విమల, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గెడ్డ స్థలంలో గ్రంథాలయం నిర్మించాలి

పార్వతీపురం: పట్టణం నడిబొడ్డున సర్వే నెంబర్ 410లో గల వరహాల గెడ్డ ప్రభుత్వ భూమిలో గ్రంథాలయం నిర్మించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ స్థలం తో కలిపి చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. పట్టణ నడిబొడ్డున ఉన్న స్థలంలో గ్రంథాలయం నిర్మిస్తే నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.జిల్లా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రంజిత్ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురంటౌన్: పట్టణంలో విద్యుత్ సరఫరా అంతరాయం శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని, విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఎస్‌ఎస్ స్కీం పనుల్లో భాగంగా కొత్త లైన్లు పనులు జరుగుతాయి, దీనివలకల్ల ఇంద్ర కాలనీ, గంట వీధి, చిన్న మాదిగ వీధి, నిర్మల కాలనీ, దేవాంగుల వారి, వీధి బంధం వారి వీధి, టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, బరాటం వీధి, కంకటి వీధి, నెయ్యిల వీధి, బోటు వీధి, పాత బస్టాండ్, తదితర కాలనీలకు విద్యుత్ సరఫరా జరగదని, కావున ప్రజలు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

జీవనశైలి మార్పుతో మధుమేహం నియంత్రణ : డిఎంహెచ్ఒ

వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జీవన శైలిలో మార్పుతో మధుమేహాన్ని నియంత్రించవచ్చునని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా జిల్లా ఆరోగ్య కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, ఎన్‌సిడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల్లో మధుమేహం ప్రధాన సమస్యగా ఉందన్నారు. రక్తంలో షుగర్ లెవెల్స్ సాధారణ స్థాయి మించితే డయాబెటిస్ వస్తుందని, ఇందుకు అనేక కారణాలున్నాయని, ఇన్సులిన్ పనితీరులో లోపం వల్ల, వంశపారపర్యంగా, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, మానసిక వత్తిడి, మద్యపానం, ధూమపానం ప్రధాన కారణాలని తెలిపారు. అధిక దాహం, ఆకలి, విపరీతమైన అలసట, తరచూ మూత్ర విసర్జన, గాయం త్వరగా మానకపోవడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు మధుమేహవ్యాధిగ్రస్తుల్లో గుర్తించవచ్చున్నారు. గ్రామీణ స్థాయిలోనే ఆరోగ్యకేంద్రాలు, సంచార చికిత్స ద్వారా షుగరు పరీక్షలు, నెలకు సరిపడా మందులు అందజేస్తున్నామన్నారు. వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మెరుగుపడేందుకు అవసరమైన పర్యవేక్షణ ఉండాలని, జీవనశైలి, ఆహార నియమావళి అంశాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లా ఎన్‌సిడి అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల్లో ఒకటైన డయాబెటిస్ గుర్తించేందుకు ఎన్‌సిడి సర్వేలో వైద్య సిబ్బంది గృహ సందర్శనలు చేసి 18 ఏళ్ల పైబడిన వారికి షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఎన్.సి.డి 3.0 సర్వే నివేదిక ప్రకారం జిల్లాలో 40వేలకు పైగా డయాబెటిస్‌తో ఉన్నారని తెలిపారు. అనంతరం డిఎంహెచ్ఒ, ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బందికి వైద్య సిబ్బంది షుగరు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఐఒ వై.విజయ్ మోహన్, ప్రోగ్రాం అధికారులు పి.ఎల్.రఘు, ఎం.వినోద్, కెఎస్ సూర్య కౌశిక్, వైద్యాధికారి రవిచంద్ర, నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి, సూపరింటెండెంట్ కామేశ్వరరావు, డెమోలు గిరి బాబు, ప్రసాద్, కార్యాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 25 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 25 మంది గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత సమస్యలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎస్‌వి గణేష్, ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, డిపిఎం రమణ, డిఇ నాగభూషన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సిపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని సంత నర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకుతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శు భారాతమని, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి – పార్వతీపురంటౌన్

స్థానిక కలెక్టరేట్ సమీపాన గల అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడి భోజనం ఎలా ఉంది, కూరలు బాగున్నాయా, లేవా అన్నం సరిపోతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సుదూరం నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చామని, హోటల్లో భోజనం చేస్తే రూ.80 తీసుకుంటున్నారని, అన్న క్యాంటీన్‌లో రూ.5 కే భోజనం లభిస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. క్యాంటీన్ నిర్వాహకులతో కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు ఎంతమంది వస్తారో ఆరా తీశారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అలాగే క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మూడు చక్రాల వాహనాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి – పార్వతీపురం

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల వాహన మంజూరుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఇన్‌ఛార్జ్ జిల్లా విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి టి.కైలాస శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు apdascac.ap.gov.in వెబ్ సైట్ నందు ఈనెల 25లోగా ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరఖాస్తుతో పాటు,70 శాతంపై బడి సదరం వైద్య ధ్రువ పత్రం, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, బోనఫైడ్ సర్టిఫికేట్, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, ఫోటోలు సెల్ఫ్ డిక్లరేషన్ పత్రం, ఆన్‌లైన్ కాపీ తప్పనిసరిగా సహాయ సంచాలకులు, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయానికి సమర్పించాలని, పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 240519 కు సంప్రదించాలని కోరారు.

మండలం ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పి.ఆమిటి నుంచి నీలకంఠాపురం 14 పంచాయతీలు కలుపుకొని ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా దర్బార్‌లో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గిరిజనులు వినతిని అందించారు. ప్రత్యేక మండలం ఏర్పాటు చేస్తే గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎంతో అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యేక మండలం ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టాలని కోరారు. గురుగుబిల్లి మండలంలో దేవాలయం, రోడ్డు నిర్మాణం చేపట్టాలని వచ్చాయి. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్పన్ కడ్రక కళావతి, నియోజక వర్గ మహిళ కార్యదర్శి వెంపటాపు భారతి, మాజీ ఎంపిపి నీలకంఠేశ్వరరావు, మాజీ సర్పంచ్ దుర్గారావు, మాజీ ఎంపిటిసి గణపతి, గిరిజన సంఘం నాయకులు రామారావు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి – కురుపాం

పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పెదగొత్తిలి సర్పంచ్ టి.లోకనాథం అన్నారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.చంటిబాబు కలిసి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభ, ప్రదర్శనలను అభినందించారు. అనంతరం అతిథులు పిల్లలతో పాటు సహపంక్తి భోజనంలో పాల్గొని పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాల మెరుగుదలకు సహకారం అందిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైసిపి నాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ మానుకోవాలి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేట్‌పరం చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని కొత్తవలస రైల్వే ఫ్లైఓవర్ వంతెన ప్రధాన రహదారి పక్కన ఓపెన్ స్టాల్ ద్వారా వైసిపి శ్రేణులు శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి కార్యదర్శి మావుడి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పురపాలక సంఘం ప్రజా ప్రతినిదులు, నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

మొంథా తుఫాన్ ప్రభావంతో ఏజెన్సీలో ఇళ్లు పూర్తిగా ధ్వంసమైన బాధితులకు గుమ్మలక్ష్మీపురం శ్రీ శ్రీనివాస సంక్షేమ వర్తక సంఘం సభ్యులు తమ వంతు సహాయంగా ముందుకొచ్చారు. ఇందులో జోగిపురం గ్రామ తుఫాను బాధితులకు తహశీల్దార్ నిమ్మక శేఖర్ చేతుల మీదుగా టార్పాలిన్లు శుక్రవారం అందజేశారు. ఆసరాగా నిలిచిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బుడంకాయల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మద్ది దొరబాబు, కమిటీ సభ్యులు మన్మధ, వెంకటరావు, కిషోర్, టిడిపి మండల కన్వీనర్ నరేష్, వైశ్య సంఘ అధ్యక్షులు హరిప్రసాద్ మాస్టర్ ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. వసతులు సక్రమంగా ఉన్నాయా లేదా, మోను ప్రకారం భోజనం పెడుతున్నారా లేదానని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆర్వో ప్లాంట్, మరుగుదొడ్లను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఎఎంసి చైర్ పర్సన్ కడ్రక కళావతి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపడాపు భారతి, మండ సర్పంచ్ హైమావతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఆంధ్రా -ఒడిశా సరిహద్దుల్లో ఎక్సైజ్ సిబ్బంది దాడులు

ప్రజాశక్తి – కురుపాం

ఆంధ్రా–ఒడిస్సా సరిహద్దు గ్రామాలైన కెరడ, అనిజ, బోర్వలువలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఎఇఎస్ ఎ.సంతోష్ ఆధ్వర్యంలో ఒడిస్సా ఎక్సైజ్ విభాగం సహకారంతో శుక్రవారం దాడులు చేపట్టినట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో సుమారు 7వేల లీటర్ల సారా తయారీకి ఉపయోగించే ముడి సరుకులు, 470 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా, ఒరిస్సా ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన సామాజిక తనిఖీ బృందం

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

స్థానిక చింతలగూడ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేట్ రిసోర్స్‌పర్సన్ కె.మన్మధరావు ఆధ్వర్యంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ కె.హరి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన ఎస్ఎంసి సభ్యులతో సమావేశం నిర్వహించి మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సక్రమంగా ఉందో లేదో అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిశీలించిన రికార్డుల నిర్వహణ తదితర విషయాలపై తమ ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. కుమారస్వామి, వాలంటీర్లు సునీత, ప్రశాంతి, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ బి.రవిబాబు తదితరులు ఉన్నారు.

కారుణ్య పత్రాలను అందజేసిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి – సాలూరు

స్థానిక మున్సిపాల్టీలోని ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న తుపాకుల మాతయ్య, తుపాకుల శివశంకర్ మరణించిన కారణంగా వారి వారసులైన తుపాకుల రామారావు, తుపాకుల ఇందుమతికి మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, కమిషనర్ టిటి రత్నకుమార్ చేతుల మీదగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, డిఇ బివి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ , ఝాన్సీ, ప్రతాప్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూరిబాయి గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు. నెహ్రూ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థినిలకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, మీరు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, నియోజకవర్గ తెలుగు మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, ఎంఇఒ చంద్రశేఖర రావు, టిడిపి నాయకులు నీలకంఠం, సుబ్బలక్ష్మి, శంకర్, ఆనంద్, రామారావు, మనోహర్, లోవరాజు తదితరులు ఉన్నారు.

మొండెంఖల్‌లో ...

కురుపాం : మండలంలోని మొండెంఖల్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఒ జి.రజనీ దుర్గ చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్.సొసైటీ ఆధ్వర్యాన....

మండలంలోని రస్తాకుంటుబాయి పాఠశాలలో ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ–2 రాధాకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ధ్రువ ముఖ్య అతిథులుగా పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్ర లేఖనం, పాటలు, డ్యాన్స్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలలోని 42 మంది విద్యార్థులకు ఎస్ సొసైటీ వారు నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్‌ను కెవికె వారు అందజేశారు. కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించడంలో భాగంగా కూర గాయల విత్తనాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల సింహాచలం నాయుడు, కెవికె కృషి విజ్ఞాన శాస్త్రవేత్త ఉమ జ్యోతి, మాజీ సర్పంచ్ పి. మాసయ్య పాల్గొన్నారు.



సీతానగరం:పిల్లలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం : మండలంలోని గెడ్డలుప్పి జంక్షన్లో గల కృషి విద్యా కేతన్, బొక్కుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణదాస్, గౌరీశ్వరరావు, కృషి విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వరప్రసాద్ బాబు నెహ్రూ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. చాచా నెహ్రూకు బాలలంటే చాలా ఇష్టమని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి దేశ భావి భారత పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు. అలాగే గుమ్మలక్ష్మీపురం హైస్కూల్, పి.ఆమిటి, తాడికొండ, కేదారిపురం కాలనీ, కొత్తగూడ, తదితర గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో బాలల వేడులకలు నిర్వహించారు. అలాగే జియమ్మవలస మండలం చినమేరంగి, పెదబుడ్డిడి, బిజెపి పురం, జియమ్మవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళ్లు అర్పించారు. నెహ్రూ జీవిత చరిత్ర, సాధించిన విజయాలు, భారత నవ సమాజ నిర్మాణంలో ఆయన పాత్ర గురించి ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.



నెహ్రూ చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వీరఘట్టం : మండలంలోని అన్ని గ్రామ పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటలు పోటీలతో పాటు డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు ప్రధానోపాధ్యాయులు బి.సోంబర బహుమతులు ప్రదానం చేశారు. జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి – కురుపాం

స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం లైబ్రేరియన్ అమ్మనబోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమనికి రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి కె.సుకృత, మండల టిడిపి కన్వీనర్ కె.వి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలార్ రంజిత్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలుగా నిలుస్తాయని, విద్యార్థులు, యువత గ్రంథాలయాల ద్వారా తమ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునని, అలాగే పుస్తక పఠనం అలవాటు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తుందని కావున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం : పుస్తక పఠనంతోనే విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి విలువైన పుస్తకాలు చదవాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచి బొత్తాడ గౌరీ శంకర రావు కోరారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. లైబ్రేరియన్ డి.సుకన్య మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఎంపిపి ఉరిటి రామారావు ప్రారంభించారు. తొలుత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. ఈ మేరకు నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఎన్నో రకాలు పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని వీటిని చదువుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని తెలిపారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడ్ల శ్రీనివాసరావు, నల్ల శ్రీరాములు నాయుడు, పెదిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, కోట్ల స్వామినాయుడు, శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూధనరావు, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో నెహ్రూకు నివాళ్లు అర్పిస్తున్న ఎంపిపి, విద్యార్థులు



కరపత్రాలను విడుదల చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల సాధనకై

20న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి – సీతానగరం

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేయాలని కోరుతూ ఈనెల 20 కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి రాయపల్లి రాము తెలిపారు. ఈ మేరకు సీతానగరంలో శుక్రవారం ఆయన తోపాటు యూనియన్ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు సనపతి కృష్ణ, తోలాపు రమేష్, పలువురు భవన నిర్మాణ కార్మికులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకుండా కాలయాపన చేసిందని, వెల్ఫేర్ బోర్డులో డబ్బులు ఉన్నప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని కార్మికుల సంక్షేమ పథకాలు ఆపివేయడం సమర్థనీయమైన చర్య కాదని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికులందరికీ సంక్షేమ పథకాలను ప్రారంభిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని పొందుపర్చినా నేటికీ సంక్షేమ పథకాలు అమలు గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికుల సంక్షేమానికి ఒక ప్రత్యేకమైన చట్టాన్ని పోరాడి సాధించుకున్న స్ఫూర్తితో నేడు ఆగిపోయిన సంక్షేమ పథకాలను ప్రారంభించాలని, మరో పోరాటానికి కార్మికులను సమాయత్తం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 20న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాల్లో అత్యధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.శంకర్రావు, బెవర శ్రీను, కె.ఈశ్వరరావు, ఆర్.సోమయ్య, ఎస్.అప్పారావు, కె.విశ్వనాథ ఆచారి పాల్గొన్నారు.



జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి – వీరఘట్టం

ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు 18వ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. శుక్రవారం వీరఘట్టంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ప్రాణాలు తెగించి సాధించుకున్న కార్మికుల చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిందని, ఇది దుర్మార్గమని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో జరపడం ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కనుక కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.సింహాచలం, ఎన్.ప్రసాద్ రావు, వై.ప్రసాదరావు, పి.ప్రసాదరావు, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలు పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి – సీతంపేట

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఏజెన్సీ ఆదివాసీ జెఎసి అధ్యక్షులు బి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు తేజేశ్వరరావు, గిరిజన ఐక్యవేదిక సభ్యులు, ఆదివాసీ సేన సభ్యులు శుక్రవారం స్థానిక ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌కు వినతిని అందజేశారు. ఏజెన్సీలో జరుగుతున్న అనేక సమస్యలను శుక్రవారం ఐటిడిఎలో పిఒకు విన్నవించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌టిఆర్ కేసులు సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీసా, అట్రాసిటీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, ఆదివాసీల రక్షణకు ఏర్పడిన ఐదో షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల సర్వహక్కులు రక్షించాలని డిమాండ్ చేశారు. సీతంపేటలో గిరిజన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల, ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సిఆర్టిలను డి గ్రేడ్ చేయకూడదన్నారు. ఏజెన్సీలో నాన్ ట్రైబల్‌కు జిసిసి ల్యాండ్ షాప్‌లు లీజ్ కు ఇవ్వరాదని, నిర్మాణం ఆపాలని విన్నవించారు. వినతిని అందజేసిన వారిలో బిడ్డిక ఉమామహేశ్వరరావు, సవర చొక్కారావు, సర్పంచులు ఆదిలక్ష్మి ,వెంకినాయుడు, తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి – కురుపాం

అంగన్వాడి కేంద్రాలు బలోపేతానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కురుపాం ప్రాజెక్ట్ కార్యదర్శి పి.సరోజ కోరారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో కలిసి సచివాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో కేంద్రాలను విలీనం చేసే ప్రయత్నాలు మానుకొని బలోపేతం చేయాలంటే 3–6 సంవత్సరాల పిల్లలందర్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నమోదయ్యేలా ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సూర్య కుమారి, శోభారాణి, రాధా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అనధికార భవనాల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

ప్రజాశక్తి – సాలూరు

మున్సిపాలిటీలో అనధికార భవనాలను క్రమబద్దీరించుకునేందుకు ప్రభుత్వం ఈనెల 12 నుంచి 120 రోజులు గడువు ఇచ్చిందని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31 లోపు అనధికారంగా నిర్మించిన ఇళ్లు, భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, కావున పట్టణ ప్రజలు సంబంధిత పత్రాలను లైసెన్స్‌డ్, టెక్నికల్ పర్సన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో www.bps.ap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని పురపాలక సంఘం సూచించిందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పట్టుకున్నారు... వదిలేశారు

ప్రజాశక్తి – పాలకొండ

నాటు సారా విక్రయాలపై నిఘా పెడతామని చెబుతున్న ఎక్సైజ్ అధికారులు ఇటీవల పట్టుకున్న ముద్దాయిని వదిలేసే పరిస్థితి కనిపించింది. చిన్న కాపు సెంటర్లో ఒక వ్యక్తిని నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకొని ఇటీవల స్టేషన్ తీసుకువెళ్లారు. అయితే ఒక రాజకీయ నాయకుడు ఫోన్ చేసి వదిలేయాలని చెప్పడంతో తీసుకెళ్లిన క్షణాల్లోనే విడిచి పెట్టేశారు. మరో ప్రత్యర్థి రాజకీయ నాయకుడు తన వార్డులో నాటుసారాతో పట్టుకుని వ్యక్తిని ఎందుకు వదిలేశారని ఎక్సైజ్ అధికారులను నిలదీయడంతో మళ్లీ ఆ వ్యక్తిని పిలిచి అరెస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. ఆ వ్యక్తిపై కేసు నమోదు కూడా చేసి రిమాండ్‌కు పంపించడంతో ఎక్సైజ్ అధికారులు తీరుపై తీవ్రవిమర్శలు వినిపిస్తున్నాయి.

సకాలంలో వైద్యమందక చూడి ఆవు మృతి

ప్రజాశక్తి – పార్వతీపురంటౌన్

సరైన వైద్యమందించక తమ 9 నెలల చూడి ఆవు మృతి చెందిందని బాధిత పాడి రైతు కోరాడ అన్నపూర్ణమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం తమ ఆవుకు కడుపు పొంగిందని పశు వైద్య శాఖ అధికారికి తెలియజేయగా, ఉదయం 8 గంటల సమయంలో సిబ్బందిని పంపించి చికిత్స చేయించారని తెలిపారు. అయితే వారు తెలిసీ తెలియని వైద్యం అందించి వెళ్లిపోయారని, అప్పటి వరకు బాగానే ఉన్న ఆవు పశు వైద్య సిబ్బంది వైద్యం చేసి వెళ్లిపోయిన కొన్ని గంటల తర్వాత అపస్మారక స్థితికి చేరుకుని కుప్ప కూలిపోయిందని, తమ ఆవుకు సరైన చికిత్స చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నపూర్ణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బాగానే నడుస్తున్న ఆవుకు కాలం చెల్లిన మందులు ఎక్కించి వైద్యం చేసి చేతులారా చంపేశారని అన్నపూర్ణమ్మ రోధించారు. కేవలం పశువైద్యులకు, సిబ్బందికి సరైన చికిత్స అందించడం రాకపోవడమే మా పశువుల మరణాలకు కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి మరణాలు జరగకుండా ఉండాలంటే పశు వైద్య ఆరోగ్య శాలలో సరైన పరికరాలు, పూర్తిస్థాయిలో మందులతో పాటు పూర్తి స్థాయిలో వైద్యమందించే వైద్యాధికారులను, సిబ్బందిని నియమించాలని, కనీసం ప్రథమ చికిత్స కూడా తెలియని ఈసిబ్బందిని తొలగించాలని పాడి రైతులు అన్నపూర్ణమ్మతో పాటు వెంకటరమణ, పాత శంకర్రావు, పాత శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు కోరారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి – కురుపాం

రైతుల ప్రయోజనార్థం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కురుపాం రైతు సేవా కేంద్రంలో పిఎసిఎస్ అధ్యక్షులు డొల్లు కిషోర్‌కుమార్, ఎఒ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న కొనుగోలు సౌకర్యాలు, పారదర్శక విధానాలను వివరించారు. ధాన్యం విక్రయంలో మోసాలు లేకుండా, కనీస మద్దతు ధర రైతుల చేతికి చేరేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు. రైతులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

పశువైద్య శిబిరం ప్రారంభం

పాడి రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. మండలంలో సీతంపేటలో పశువైద్య అధికారి డా. శైలజ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, ఆడ దూడల ప్రదర్శన కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగనిర్ధారిత ఇంజక్షన్ ధరను రూ.500 నుంచి రూ.150కు తగ్గించడం, ఇప్పటి వరకు 170 గోశాలల పంపిణీ, పశుభీమాకు 80శాతం సబ్సిడీ, దాణాకు 50శాతం సబ్సిడీ, ప్రతి గ్రామంలో నీటి తొట్టెల ఏర్పాటు వంటి చర్యలను రేపటి పాడి రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు. అనంతరం పశువులకు ఉచిత మందుల పంపిణీతో పాటు ఉత్తమ ఆడ దూడలను పెంచిన రైతులకు బహుమతులకార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, డెంకాడ రామకృష్ణ, వెంపడాపు భారతి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ అఖిలేష్, పశువైద్య వ్యవసాయ శాఖ సిబ్బంది, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మధుమేహం కంటిచూపునకు ప్రమాదం

ప్రజాశక్తి – కురుపాం

మధుమేహంతో కంటి చూపుకు ప్రమాదకరమని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రవైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మధుమేహ దినోత్సవం సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డయాబెటిక్ రేటినోపతి వంటి మధుమేహం వల్ల వచ్చే కంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, కంటి సమస్యలున్న వారికి ఉచిత నేత్ర పరీక్షలు, చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. కేటరాక్ట్ (అంతర కుసుమం), టెరిజియం (కొయ్యకండ) ఉన్న రోగులను గుర్తించి శస్త్ర చికిత్సల కోసం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారి డాక్టర్ సూర్య కౌశిక్, ఆరోగ్య మిత్రులు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రత

ప్రజాశక్తి – సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలు మెట్టిదిబ్బలను శుక్రవారం వైద్యాధికారి పి.ఉషారాణి ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఆస్పత్రి ఆవరణ అంతా శుభ్రం చేసి మొక్కలు నాటేందుకు కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల కలెక్టర్ పర్యటించి పరిశుభ్రత పాటించాలని సూచించడంతో ఆరోగ్య కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్ది పూల మొక్కలతో కళకళలాడేలా చర్యలు చేపట్టాలని ఆదేశాల మేరకు ఆసుపత్రి సిబ్బంది దగ్గర ఉండి పనులు చేయిస్తున్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి వెంకటరమణ, యుడిసి పాల్గొన్నారు.

పోలీసులకు పట్టుబడ్డ గంజాయి

ప్రజాశక్తి –భామిని

ఒడిశా నుంచి ఆంధ్రా వైపు అక్రమంగా కారులో తరలిస్తున్న గంజాయిని బత్తిలి పోలీసులు చాకచక్యంగా శుక్రవారం పట్టుకున్నట్టు సమాచారం. బత్తిలి చెక్‌పోస్ట్ వద్ద ఒడిశా నుండి వచ్చిన కారు నిలిపివేయకుండా వెళ్లిపోవడంతో, అనుమానం వచ్చి కారును వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలో కారు డిక్కీలో అక్రమ గంజాయిని గుర్తించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

ఇప్పవలసలో గ్రామసభ

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని ఇప్పలవలసలో ఉపాధి హామీ గ్రామ సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎపిఒ పి.బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామసభల ద్వారా పనులు తీర్మానం చేసుకొ తీర్మానాలు చేసుకొని గ్రామసభలో ఆమోదించుకున్న పనులను ఉపాధిహామీ చట్టంలో చేపడతాయన్నారు. ఈ పనులు చేయడానికి ముందుగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలో నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్ లక్ష్మణరావు, గ్రామపెద్దలు, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.